APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 05 అక్టోబర్ 2026 సంపుటి: 01 సంచిక :130 పేజీలు : 04 వెల: 2-00/-

ఘనంగా ఆసియా క్రీడల ముగింపు వేడుకలు..

21 స్వర్ణాలతో నాలుగో స్థానంలో భారత్!



ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడలు-2026కు తెరపడింది. జపాన్‌లోని అయిచి-నగోయా వేదికగా సెప్టెంబర్ 19న ప్రారంభమైన 20వ ఆసియా క్రీడలు.. ఆదివారం ముగిశాయి.

ఢిల్లీ : ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడలు-2026కు తెరపడింది. జపాన్‌లోని అయిచి-నగోయా వేదికగా సెప్టెంబర్ 19న ప్రారంభమైన 20వ ఆసియా క్రీడలు.. ఆదివారం ముగిశాయి. మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకల్లో ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధ్యక్షుడు షేక్ జోయాన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. మిగతా..2లో

ఓటమి భయంతోనే ఉపఎన్నికలను అడ్డుకుంటున్నారు: బీజేపీ ఎంపీ డీకే అరుణ



ఖైరతాబాద్ శాసనసభ ఉపఎన్నికల్లో ఓటమి ఎదురవుతుందనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక జరగకుండా అడ్డుకునేందుకు పిటిషన్లు వేయిస్తోందని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విమర్శించారు.

హైదరాబాద్, అక్టోబర్ 04: ఖైరతాబాద్ శాసనసభ ఉపఎన్నికల్లో ఓటమి ఎదురవుతుందనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక జరగకుండా అడ్డుకునేందుకు పిటిషన్లు వేయిస్తోందని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడాన్ని ఎంపీ డీకే అరుణ తీవ్రంగా తప్పుపట్టారు. గతంలో పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక సిగ్గులేకుండా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటోందని మండిపడ్డారు. మిగతా..2లో

ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం ప్రారంభం



★ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ రంగంలో ఒక నూతన వినూత్న శకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

అమరావతి, అక్టోబరు 4: ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ రంగంలో ఒక నూతన వినూత్న శకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో 2.0 కింద 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో ఏపీలో 'అందరికీ ఇళ్లు' లక్ష్యం దిశగా ఒక కీలక అడుగు పడిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. గ్రామీణ గృహ నిర్మాణంలో దేశంలో తొలిసారిగా '3ఢ కాంక్రీట్ ప్రింటింగ్' పైలట్ ప్రాజెక్టును ప్రారంభించడం ఈ బృహత్తర కార్యక్రమానికి ఉన్న ప్రత్యేకత అని వివరించారు.

ప్రతి కుటుంబానికి భరోసా కూటమి ప్రభుత్వం

2029లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేస్తాం


- 2029లోపు వందశాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో 3డీ
- కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలెట్ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు.
- గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో సీఎం చంద్రబాబు పర్యటన



అమరావతి : పేదలకు ఇళ్లంటే నాలుగు గోడలు కాదని భద్రత, భవిష్యత్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి కుటుంబానికి భరోసా, ప్రతి వర్గానికి అండ, ప్రతి ప్రాంతానికి అవకాశం ఇదే కూటమి ప్రభుత్వ సిద్ధాంతమన్నారు. ప్రతి పేదవాడికి ఇంటి కల సాకారం చేయాలన్నదే సంకల్పమన్న సీఎం, 2029 లోపు వందశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలెట్ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ప్రతి కుటుంబానికి భరోసా కూటమి ప్రభుత్వం : అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మిగతా..2లో

ఏపీకీ నేను మామయ్యనే - అభివృద్ధిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలవబోతోంది

- ఏపీ ప్రజలంటే తనకు ఎంతో ప్రేమ అని శివరాజ్ సింగ్ అన్నారు.
- తాను కేవలం మధ్యప్రదేశ్‌కే కాదు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామయ్య వంటివాడినే అని వ్యాఖ్యానించారు.
- దేశంలోనే అభివృద్ధిలో ఏపీ ప్రథమ స్థానంలో నిలవబోతోందన్నారు.



అమరావతి : రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన మాజీ సీఎం జగన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ధ్వజమెత్తారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి, పేదల సొంతింటి కలను జగన్ చిదిమేశారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో సీఎం చంద్రబాబుతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఇదే వేదికపై 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే అభివృద్ధిలో ఏపీ అగ్రగామిగా మిగతా..2లో

అయోధ్య విరాళాల చోరీ కేసును ముగించేందుకు మోదీ సర్కార్ తొందరపడుతోంది



★రామమందిర విరాళాల చోరీ కేసు దర్యాప్తుపై కాంగ్రెస్ ఫైర్

★దర్యాప్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మండిపాటు

★విపక్ష నాయకులపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి వెనుకాడదని ఎద్దేవా

అమెరికా ఒంటరి శక్తిగా మారుతోంది..

జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు..

- అమెరికా తన విదేశాంగ వైఖరిలో గణనీయమైన మార్పులు చేసుకుంటోందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు.
- అమెరికా ప్రస్తుతం మరింత ఒంటరి శక్తిగా మారుతోందని, అది ఆ దేశం కావాలని తీసుకున్న నిర్ణయమేనని ఆయన వ్యాఖ్యానించారు.



ఢిల్లీ : అమెరికా తన విదేశాంగ వైఖరిలో గణనీయమైన మార్పులు చేసుకుంటోందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రస్తుతం మరింత ఒంటరి శక్తిగా మారుతోందని, అది ఆ దేశం కావాలని తీసుకున్న నిర్ణయమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ రాజకీయాల్లో అమెరికా-చైనా పోటీ, చైనా ఆర్థిక ఎదుగుదల, అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరిస్తున్న కొత్త వ్యూహాలపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు మ్యూనిక్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన జైశంకర్.. ప్రస్తుతం ప్రపంచ వ్యవస్థలో ప్రధానంగా రెండు పరిణామాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఒకటి అమెరికా తన వైఖరిని మిగతా..2లో

భారత్ అణు శక్తి బలోపేతం.. 190 వార్‌హెడ్‌లు,

మూడు మార్గాల్లో వ్యూహాత్మక సామర్థ్యం

- దేశ రక్షణ రంగంలో భారత్ సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తూ, తన అణు శక్తిని వేగంగా ఆధునీకరిస్తోంది.
- తాజాగా ఓ నివేదిక ప్రకారం.. భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 190 అణు వార్‌హెడ్‌లు అందుబాటులో ఉన్నట్లు అంచనా.



ఢిల్లీ, అక్టోబర్ 04: దేశ రక్షణ రంగంలో భారత్ సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తూ, తన అణు శక్తిని వేగంగా ఆధునీకరిస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 'బులెటిన్ ఆఫ్ ది అటామిక్ సైంటిస్ట్స్' తాజా నివేదిక ప్రకారం.. భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 190 అణు వార్‌హెడ్‌లు అందుబాటులో ఉన్నట్లు అంచనా. శత్రువుల నుంచి వచ్చే ఏ రకమైన ముప్పునైనా తట్టుకుని తిప్పికొట్టేలా నింగి, నేల, సముద్ర మార్గాల ద్వారా ప్రయోగించే వ్యూహాత్మక వ్యవస్థలను భారత్ విజయవంతంగా సిద్ధం చేసుకుంది. శాస్త్రవేత్తలు హాన్స్ ఎమ్ క్రిస్టెన్సెన్, మిగతా..2లో

రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు



★కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

★రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్

★రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న

★కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు

ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో

భారత్ ముందంజలో ఉంది

- ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో భారతదేశం ముందంజలో ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- శ్వేత విప్లవంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.



మెదక్ జిల్లా, అక్టోబరు 4 : ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో భారతదేశం ముందంజలో ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శ్వేత విప్లవంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈరోజు (ఆదివారం) మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని బ్రహ్మణపల్లిలో అమూల్ సంస్థకు చెందిన తొలి అత్యాధునిక ప్లాంట్‌కు (సాబర్ డైరీ తెలంగాణ ప్రాజెక్ట్) భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ రఘునందన్ రావు, కంపెనీ చైర్మన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భూమి పూజ అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

రూ.400 కోట్లతో అమూల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు..

తెలంగాణ నడిబొడ్డున తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ఏర్పాటుకు భూమి పూజ చేశామని కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.400 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. వచ్చే 18 నెలల్లో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. ఈ పరిశ్రమతో స్థానిక యువత, మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు. మిగతా..2లో

వెయ్యిరోజులు దాటినా 6 గ్యారెంటీల అమల్లో రేవంత్ సర్కార్ విఫలం

- కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మైనారిటీలకు ప్రతి ఏడాది రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించారు.



సిద్దిపేట జిల్లా, అక్టోబరు 4: కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలకు ప్రతి ఏడాది రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మైనారిటీలకు రూ.1,800 కోట్ల వరకు ఖర్చు చేశామని తెలిపారు. తెలంగాణ తురక కాశ సంక్షేమానికి చేయూత కార్యక్రమంలో భాగంగా గజ్వేల్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 90 మంది కాశ కార్మికులకు స్టోన్ కటింగ్ మిషన్లను హరీశ్‌రావు (ఆదివారం) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో మైనారిటీల సంక్షేమానికి కేటాయింపులు, ఖర్చు తగ్గాయని చెప్పుకొచ్చారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం ప్రారంభం

బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో మొత్తం 177 ఇళ్లను ఈ సాంకేతికతతో నిర్మిస్తారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఒక్కో ఇంటిని కేవలం 10 రోజుల్లోనే పూర్తి చేయొచ్చని వివరించారు. అంతేకాకుండా, నిర్మాణ వ్యర్థాలను తగ్గిస్తూ, నాణ్యత, సమర్థతను ఇది మరింత పెంచుతుందని చెప్పుకొచ్చారు. ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని వివరించారు. మోదీ దార్శనిక నాయకత్వానికి, నిరంతర నిబద్ధత ఇదని.. ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు నిరంతరం మద్దతు ఇస్తూ, గ్రామీణ గృహ నిర్మాణంలో నూతన విినూత్న విధానాలను ప్రోత్సహిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. సాంకేతికతతో విస్తృతిని, నాణ్యతతో వేగాన్ని, విినూత్న విధానాలతో సంక్షేమాన్ని జోడిస్తోందని చెప్పుకొచ్చారు. ఈ గృహ నిర్మాణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో మద్దతు అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక నీడ, ప్రతి ఇటుకలోనూ ఆధునిక సాంకేతికత, గ్రామీణ ఏపీ అభివృద్ధికి ఒక బలమైన పునాది అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ఘనంగా ఆసియా క్రీడల ముగింపు వేడుకలు..
21 స్వర్ణాలతో నాలుగో స్థానంలో భారత్!

'వన్ ఏషియా' థీమ్‌తో ముగింపు వేడుకలు నిర్వహించారు. 2030 ఆసియా క్రీడలకు ఆతిథ్యమివ్వనున్న ఖతార్‌లోని దోహాకు బ్యాటన్‌ను అప్పగించారు. ఈ ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం 85 పతకాలు సాధించింది. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. గత ఆసియా క్రీడల్లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 85 పతకాలకే పరిమితమైంది. అయితే గత క్రీడల్లోనూ భారత్ నాలుగో స్థానంలోనే నిలిచింది. చైనా 341 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. ఇందులో ఏకంగా 169 స్వర్ణాలు ఉన్నాయి. జపాన్ 269 పతకాలతో రెండో స్థానంలో ఉండగా.. దక్షిణ కొరియా 150 పతకాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది.

భారత్ తరపున నీరూ దండా..

ముగింపు వేడుకల్లో భారత్ తరపున షూటర్ నీరూ దండా పతాకధారిగా వ్యవహరించింది. అయిచి-నగోయా క్రీడల్లో ఆమె రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాన్ని సాధించి భారత తరపున ప్రత్యేకంగా నిలిచింది. ఈ ఆసియా క్రీడల్లో దాదాపు 17 వేల మంది క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు. మొత్తం 469 స్వర్ణ పతకాల ఈవెంట్లు నిర్వహించారు. టోక్యో నుంచి ఒసాకా వరకు పలు ప్రాంతాల్లో పోటీలు జరిగాయి. మొత్తం 43 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. పాడెల్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, టెక్‌బాల్, సర్ఫింగ్ వంటి క్రీడలు తొలిసారిగా ఆసియా క్రీడల్లో చోటు దక్కించుకున్నాయి.

ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో భారత్ ముందంజలో ఉంది

తెలంగాణలో ఇలాంటి పరిశ్రమలు రావడం సంతోషకరమైన విషయమని చెప్పారు. గ్రామాల్లో కో ఆపరేటివ్ సోసైటీలో రాజకీయాలు చేరిపోయి నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. ఈ సహకార సంఘాలను పునర్నిర్మాణం చేసుకోవాలని సూచించారు. రైతులంతా కలిసి ఓ కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

పాల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి..

సహకార వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మెరుగుపరుస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. కేంద్రప్రభుత్వం కొత్తగా కో ఆపరేటివ్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని వెల్లడించారు. గతంలో ఈ శాఖ లేదని.. దీని ప్రాధాన్యం గుర్తించి అమిత్ షాను మంత్రిగా చేసిందని ప్రస్తావించారు. పాల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి అమిత్ షా అందరూ సీఎంలతో మాట్లాడుతున్నారని తెలిపారు. తెలంగాణలో 1525 కొత్త కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

పరిశ్రమలకు పూర్తి సహకారం అందిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు

తమ ప్రభుత్వం నుంచి పరిశ్రమలకు పూర్తి సహకారం ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తెలంగాణలో విజయ డైరీపై పాడి రైతులు ఆధారపడి ఉన్నారని తెలిపారు. అమూల్ డైరీకి గొప్ప చరిత్ర ఉందని చెప్పుకొచ్చారు. ఎంపీ రఘునందన్ రావు ప్రతిపాదన పెట్టగానే తాము అమలు చేశామని వివరించారు. రైతులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పాడి రైతులకు పాల మద్దతు ధర పెంచామని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బంది పడకుండా కొత్త ఆదాయ వనరులు వెతుక్కోవాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

భారత్ అణు శక్తి బలోపేతం.. 190 వార్‌హెడ్‌లు,
మూడు మార్గాల్లో వ్యూహాత్మక సామర్థ్యం

మాట్ కోర్డా, ఎలియానా జాన్స్, మెక్సెంజీ నైట్-బోయిల్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. భారత్ తన అణు సామర్థ్యంలో పారదర్శకతను కాపాడుకుంటూనే, స్వదేశీ పరిజ్ఞానంతో ఆయుధ సంపత్తిని బలోపేతం చేసుకుంటోంది. వైమానిక దళంలో మిరాజ్ 2000, జాగ్వార్ విమానాలు ప్రస్తుతం వ్యూహాత్మక అణు దాడులు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. రానున్న రోజుల్లో జాగ్వార్ స్థానంలో ఫ్రాన్స్ నుంచి పొందిన 'రఫేల్' యుద్ధ విమానాలు ఈ బాధ్యతను స్వీకరించనున్నాయని నివేదికలు పేర్కొన్నాయి.క్షేత్రస్థాయి క్షిపణులు రక్షణ పరిశోధన పురోగతి సంస్థ స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'అగ్ని' క్షిపణి శ్రేణి భారత వ్యూహాత్మక బలానికి వెన్నెముకగా నిలిచింది. పృథ్వి-గ్ని-× (700 కి.మీ) నుంచి అగ్ని- (3,500 కి.మీ కంటే ఎక్కువ) వరకు ఆరు రకాల బాలిస్టిక్ క్షిపణులు పూర్తిస్థాయి వినియోగంలో ఉండగా, అధునాతన 'అగ్ని ప్రైమ్' త్వరలోనే పూర్తిస్థాయిలో రంగంలోకి దిగనుంది. సుమారు 5,000 కిలోమీటర్లకు పైగా పరిధి కలిగిన 'అగ్ని-' క్షిపణితో భారత రక్షణ పరిధి ఊహించని స్థాయికి పెరిగింది. దీని ద్వారా పాకిస్థాన్, చైనా దేశాలలోని ప్రతి మూలతో పాటు మధ్య ఆసియా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, యూరప్‌లోని కీలక ప్రాంతాలు భారత క్షిపణి పరిధిలోకి వస్తాయి. సరిహద్దులకు దూరంగా, సురక్షితమైన అంతర్భాగాల నుంచి ప్రయోగించినా శత్రు లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగలగడం దీని ప్రత్యేకత. 'మొదట వినియోగించం' అనే ప్రాథమిక సూత్రానికి కట్టుబడి ఉన్నప్పటికీ, సార్వభౌమాధికార రక్షణ విషయంలో భారత్ సాధించిన ఈ స్వయంసమృద్ధి శత్రుదేశాలకు బలమైన హెచ్చరికగా నిలుస్తోంది.

అమెరికా ఒంటరి శక్తిగా మారుతోంది..
జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు..

గణనీయంగా మార్చుకోవడం కాగా, మరొకటి చైనా ప్రభావం వేగంగా పెరగడం అని చెప్పారు. అమెరికా తన అంతర్జాతీయ పాత్రను పునఃపరిశీలించుకుంటోందని జైశంకర్ అన్నారు. ఇది అనుకోకుండా జరుగుతున్న పరిణామం కాదని, అమెరికా ఎంచుకున్న విధానంలో భాగంగానే ఈ మార్పు జరుగుతోందని ఆయన పేర్కొన్నారు ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను ప్రభావితం చేస్తున్న మరో ప్రధాన అంశం చైనా ఎదుగుదల అని జైశంకర్ చెప్పారు. ప్రపంచ తయారీ రంగంలో చైనా సుమారు మూడో వంతు వాటాను కలిగి ఉందని, దీంతో అంతర్జాతీయ రాజకీయాలపై ఆ దేశ ప్రభావం క్రమంగా పెరుగుతోందని అన్నారు. అమెరికా, చైనా మధ్య పోటీ ఇప్పుడు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాలేదని, ఇతర దేశాలపై కూడా ప్రభావం చూపుతోందని అన్నారు ఇక, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ప్రయోజనాలపై మరింత స్పష్టతతో వ్యవహరిస్తున్నాయని జైశంకర్ అన్నారు ఆయా దేశాలు స్వయం ఆధారితను పెంచుకోవడంతో పాటు, ఒకే దేశంపై ఎక్కువగా ఆధారపడకుండా వివిధ దేశాలతో సంబంధాలను విస్తరించుకుంటున్నాయని తెలిపారు. చాలా దేశాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా వివిధ భాగస్వాములను ఎంచుకుంటున్నాయని జైశంకర్ అన్నారు. ప్రతి అంశంలో ఒకే విధమైన అభిప్రాయాలు కలిగి ఉండాల్సిన అవసరం లేకుండా, నిర్దిష్ట అంశాలపై కలిసి పనిచేసే విధానం పెరుగుతోందని వివరించారు.

ఓటమి భయంతోనే ఉపఎన్నికలను
అడ్డుకుంటున్నారు: బీజేపీ ఎంపీ డీకే అరుణ




ప్రస్తుతం ఆ ఎమ్మెల్యేలు తాము ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో అద్భుత పాలన అందిస్తున్నామని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు.. మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. పాలనపై నమ్మకముంటే, ఫిరాయింపు ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ఉపఎన్నికల్లో పోటీకి నిలబెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తూ రాష్ట్రాన్ని తీవ్రంగా అప్పులపాలు చేశాయని, అభివృద్ధిని కుంటుపరిచాయని డీకే అరుణ ఆరోపించారు. గతంలో ఖైరతాబాద్ సీటును బీజేపీ గెలుచుకుందని, రాబోయే రోజుల్లోనూ అక్కడ కమలం జెండానే ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తోందని స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పక తప్పదని డీకే అరుణ హెచ్చరించారు.

ప్రతి కుటుంబానికి భరోసా కూటమి ప్రభుత్వం - 2029లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేస్తాం

మొదటి పేజి తరువాయి

2029లోపు వందశాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. 12 ఏళ్లలో నాలుగు కోట్లకుపైగా పక్కా ఇళ్లు నిర్మించిన ఏకైక ప్రభుత్వం ఎన్డీయే అని పేర్కొన్నారు. "ప్రతి కుటుంబానికి భరోసా కూటమి ప్రభుత్వం. సంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీలో ఇళ్ల నిర్మాణం చేస్తున్నాం. ఈ సాంకేతికతతో రెండేళ్ల సమయానికి బదులుగా, మూడు నెలల్లోనే నిర్మాణం పూర్తవుతుంది. ఇలా 117 ఇళ్ల నిర్మాణాన్ని ప్రయోగాత్మకంగా చేపడుతున్నాం. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని భ్రష్ట పట్టించింది. ఎక్కడో కొండల్లో గుట్టల్లో మంజూరు చేసింది. నివాసయోగ్యం కాని ఇళ్లను మంజూరు చేస్తే ఎవరికైనా లాభం ఉంటుందా? కరవు సీమను సిరుల సీమగా మారుస్తామని హామీ ఇచ్చాం. పేదలకు తాము ఇచ్చిన 6 లక్షల ఇళ్లను గత ప్రభుత్వం రద్దు చేశారన్న చంద్రబాబు, మళ్లీ వాటిని లబ్ధిదారులకు అందిస్తామని భరోసా ఇచ్చారు. రిలయన్స్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి



వస్తున్నాయి" అని చంద్రబాబు తెలిపారు. " ఏపీకి 75 వేల ఇళ్ల మంజూరయ్యాయి. నేను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపారు. 3 లక్షలు చాలవు 9 లక్షల ఇళ్లు కావాలని కోరాను. ప్రతి పేదవాడికి ఇంటి కల సాకారం చేయాలని సంకల్పించా. నా సంకల్పానికి తోడుగా శివరాజ్‌సింగ్ చేయి కలిపారు. 9 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తాం ప్రతి పేదవాడి బాగుపడాలి. సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం. కరవు సీమను సిరుల సీమగా తయారుచేస్తామని హామీ ఇచ్చాం. రిలయన్స్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి. దూరదృష్టితో ఆలోచించి పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకొచ్చా. పట్టిసీమతో కృష్ణా డెల్టాను కాపాడింది కూటమి ప్రభుత్వమే. అభివృద్ధి చేస్తుంటే కొంతమంది అడ్డంపడ్డారు, ఎక్కడా తగ్గలేదు. వచ్చే మార్చికి పోలవరం పూర్తిచేసి ప్రధాని చేతులమీదుగా జాతికి అంకితం చేస్తాం. విజయవాడ, తెనాలి, మంగళగిరి, గుంటూరు మెగా సిటీగా తయారవుతుంది." - నారా చంద్రబాబు, ముఖ్యమంత్రి
పెమ్మసాని పొలిటికల్ హీరో : " బుర్రిపాలెం అంటే సూపర్‌స్టార్ కృష్ణ గుర్తొస్తారు. ఇప్పుడు అక్కడ ఇంకో హీరో వచ్చారు. ఆయనే పెమ్మసాని. కృష్ణ సినీ హీరో అయితే పెమ్మసాని పొలిటికల్ హీరో. అభివృద్ధి చేయడంలో పెమ్మసాని ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. నాకు కేబినెట్‌లో మొదట గుర్తొచ్చేది నాదెండ్ల మనోహర్. ధరలు పెరగకుండా ఆయన సమర్థంగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కోసం త్యాగం చేసిన సీనియర్ నేత రాజేంద్రప్రసాద్. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అనునిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు" అని చంద్రబాబు తెలిపారు.

ఏపీకీ నేను మామయ్యనే - అభివృద్ధిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలవబోతోంది

మొదటి పేజి తరువాయి

నిలవబోతోందని శివరాజ్ సింగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పేదల కోసం ప్రధాని మోదీ అనేక పథకాలు, నిధులు ఇస్తే వాటిని జగన్ దారి మళ్లించి పాపం చేశారని శివరాజ్‌సింగ్ దుయ్యబట్టారు. రాష్ట్ర వాటా ఇచ్చేందుకు నిరాకరించి, పేదల ఇళ్లను లాక్కుని మూర్ఖుడిలా ప్రవర్తించారని విమర్శించారు. మోదీ ఇచ్చిన ఇళ్లను జగన్ నిర్మించి ఉంటే, ఈపాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండేదన్నారు. విధ్వంస ఆలోచనలతో జగన్ పేదల కలను పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. 'దిల్ మాంగే మోర్' : సీఎం చంద్రబాబు సంకల్ప బలం చాలా గొప్పదని శివరాజ్ సింగ్ కొనియాడారు. కేంద్రం రూపొందించిన నిబంధనల ప్రకారం ఏపీకి 76 వేల ఇళ్ల వస్తాయని అధికారులు చెప్పగా, చంద్రబాబు అది సరిపోదన్నారని గుర్తుచేశారు. దీంతో కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అయితే ఇవాళ చంద్రబాబు మాట్లాడుతూ 'దిల్ మాంగే మోర్' అన్నారని 3 లక్షలు కాదు 6 లక్షల ఇళ్లు కావాలని తనను కోరారని తెలిపారు. ఇప్పుడు మంజూరు చేసిన 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలోపు మరో 3 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఆ మూడు లక్షల ఇళ్లు పూర్తయ్యాక, ఇంకో 3 లక్షల ఇళ్లు ఇస్తామని, ఏపీలో వందశాతం ఇళ్ల నిర్మాణం జరిగేలా కేంద్రం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతికి అమరావతి మూలమని, కేంద్రం నుంచి ఏపీకి పూర్తి సహాయం అందుతోందని శివరాజ్ సింగ్ స్పష్టం చేశారు. మోదీ, చంద్రబాబు, పవన్ కలిసి రాష్ట్ర ప్రగతికి ముగ్గురు మార్గదర్శకులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇళ్ల నిర్మాణంలో వినియోగిస్తున్న 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ దేశానికే రోల్‌మోడల్ అవుతుందన్నారు. టెక్నాలజీపై ముందే ఆలోచించే చంద్రబాబు విజన్, దేశానికే ఒక దిక్సూచిగా మారనుందని ప్రశంసించారు. మహిళల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా అక్టోబర్ 15న విజయవాడలో 'సరన్ మేళా' నిర్వహించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఏపీకి కూడా నేను మామయ్యనే : ఏపీ ప్రజలంటే తనకు ఎంతో ప్రేమ అని శివరాజ్ సింగ్ అన్నారు. తాను కేవలం మధ్యప్రదేశ్‌కే కాదు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామయ్య వంటివాడినే అని వ్యాఖ్యానించారు. తెనాలి చరిత్ర, తెనాలి రామకృష్ణుడి కీర్తి గురించి తాను చిన్నప్పటి నుంచీ విన్నానని గుర్తుచేసుకున్నారు. ప్రతిభకు మారుపేరైన ఈ పుణ్యభూమికి కోటి ప్రణామాలు చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు ప్రజలతో



మమేకమయ్యే తీరు తనకు చాలా నచ్చిందని, ఏపీ ప్రజల మమకారం ఎప్పటికీ తన మదిలో నిలిచి ఉంటుందని ఆయన చెప్పారు. దేశంలోనే అభివృద్ధిలో ఏపీ ప్రథమ స్థానంలో నిలవబోతోందని స్పష్టం చేశారు. "ఏపీలో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించాలన్నది చంద్రబాబు స్వప్నం. కానీ జగన్ నువ్వు ఏం చేశావ్. ప్రధాని మోదీ ఏపీకి ఇళ్లు ఇస్తే, రాష్ట్రం వాటా ఇచ్చేందుకు జగన్ నిరాకరించారు. జగన్ మిమ్మల్ని ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. పేదలకు వంద శాతం ఇళ్లు నిర్మించడంలో కేంద్రం అండగా ఉంటుంది."

వెయ్యిరోజులు దాటినా 6 గ్యారెంటీల అమల్లో రేవంత్ సర్కార్ విఫలం

మొదటి పేజి తరువాయి

మైనారిటీ గురుకులాల నిర్వహణ గాడితప్పింది..

మైనారిటీ గురుకులాల నిర్వహణ గాడితప్పిందని.. విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని హరీశ్‌రావు అన్నారు. విదేశీ విద్య కోసం మైనారిటీ విద్యార్థులకు అందుతున్న స్కాలర్‌షిప్‌లు సకాలంలో ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. మైనారిటీ కార్పొరేషన్ ఉద్యోగులకు నెలలుగా జీతాలు అందడం లేదని చెప్పారు. ఉర్దూ అకాడమీ ఉద్యోగులకు ఏడాదిగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. మల్లన్నసాగర్‌ను కేసీఆర్ అద్భుతంగా నిర్మించారని తెలిపారు. కేసీఆర్ పాలనలో గజ్వేల్ రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌తో గజ్వేల్‌కు సాగునీరు అందించే ప్రయత్నం చేశామని వెల్లడించారు. కన్నెపల్లి నుంచి నీళ్లు విడుదల చేస్తే మల్లన్నసాగర్‌కు నీరు వస్తుందని వివరించారు. కన్నెపల్లి నుంచి నీళ్లు విడుదల చేయకపోవడంతో మల్లన్నసాగర్‌కు నీరందడం లేదని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం కూలిపోయిందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. మల్లన్నసాగర్ పనుల్లో ఇంకా 5 శాతం వరకు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కోర్టు కేసులను పరిష్కరించి మిగిలిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు తరలించేందుకు భారీ పైపులైన్లు వేశారని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను వెంటనే



పరిష్కరించాలని కోరారు.

కల్యాణలక్ష్మి బకాయిలను చెల్లించాలి..

వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు కేసీఆర్ హయాంలో ఇళ్లు, మౌలిక వసతులు కల్పించామని ప్రస్తావించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని ప్రశ్నల వర్షం కురిపించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నారని, వెయ్యి రోజులు దాటినా ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. కల్యాణలక్ష్మి పథకాన్ని ఎన్నికల హామీ లేకపోయినా కేసీఆర్ ప్రారంభించారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో 2.50 లక్షల మంది ఆడపిల్లల పెళ్లిళ్లకు ప్రతి ఏడాది రూ.2,600 కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి చెక్కుల కోసం రాష్ట్రంలో 2 లక్షల మంది ఎదురుచూస్తున్నారని అన్నారు. పెళ్లిళ్లు చేసుకున్న పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పట్టుబట్టారు.

కాంగ్రెస్ పాలనలో గజ్వేల్‌లో అభివృద్ధి మందగించింది..

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్‌లో రోడ్లు, డ్రైనేజీ, ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలల్లో అభివృద్ధి జరిగిందని చెప్పుకొచ్చారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో గజ్వేల్‌లో అభివృద్ధి మందగించిందని అన్నారు. గజ్వేల్‌లో కొత్త అభివృద్ధి పనుల కంటే 'ఇళ్లు, దుకాణాలు అద్దెకు' బోర్డులే కనిపిస్తున్నాయని తెలిపారు. గజ్వేల్ ప్రజలు ఎవరు ఏం చేశారో గమనిస్తున్నారన్నారు. పనులు చేసిన వారినే ప్రజలు గుర్తిస్తారని.. మాటలు చెబితే ప్రయోజనం లేదని చెప్పారు. కళ్ల ముందు కనిపించే అభివృద్ధినే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. గజ్వేల్ అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకుంటారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

అయోధ్య విరాళాల చోరీ కేసును ముగించేందుకు మోదీ సర్కార్ తొందరపడుతోంది

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసు దర్యాప్తును ముగించడానికి బీజేపీ ప్రభుత్వం తొందరపడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతోందని మండిపడింది. దర్యాప్తు విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. రామయ్య విరాళాల చోరీ కేసులో శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వంటి వారిని కాపాడుతోందని పేర్కొంది. జూన్ 4న దొంగిలించిన సొమ్ముకు సంబంధించిన వీడియో చంపత్ రాయ్ చేరిన తర్వాత, ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో 21 రోజుల జాప్యం ఎందుకు జరిగిందని ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీఐలను దుర్వినియోగం చేయడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం వెనుకాడదు. కానీ అయోధ్య రామమందిరంలో 105 సార్లు జరిగిన చోరీ ఘటనలు సీసీటీవీలో రికార్డైన తర్వాత కూడా దొంగలకు ఆశ్రయం కల్పించారని అనుమానిస్తున్న వారి వరకు దర్యాప్తు ఎందుకు వెళ్లలేదు?. 105సార్లు జరిగిన చోరీ నుంచి కేవలం రూ. 79.85 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్న తర్వాత కేసును మూసివేయడానికి ఎందుకంత తొందర?. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాలను ఎందుకు నిందితులుగా చేర్చలేదు. అందుకు బదులుగా వారిని సాక్షులుగా ఎలా చేర్చారు?. రామమందిర విరాళాల చోరీ విచారణ అసలు లక్ష్యం కేవలం చిన్న దొంగలను పట్టుకోవడమేనా? లేక ఎవరి పర్యవేక్షణ, అండతో ఈ చోరీలు జరిగాయో వారిని జవాబుదారీగా నిలబెట్టడమా?. అయోధ్య రామాలయ విరాళాల చోరీ దొంగల పట్ల మోదీ ప్రభుత్వం ఎందుకంత ఉదాసీనంగా ఉంది?. గుర్తుంచుకోండి, అధికార అహంకారం స్వయం వినాశనానికి దారితీస్తుంది"

జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి : జైరాం రమేశ్

రామమందిర విరాళాల చోరీ కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పక్షపాత, విశ్వసనీయమైన విచారణ జరపాలని కాంగ్రెస్ మొదటి నుంచీ డిమాండ్ చేస్తోందని జైరాం రమేశ్ అన్నారు. "జూన్ 4న దొంగిలించిన సొమ్ముకు సంబంధించిన వీడియో చంపత్ రాయ్ దృష్టికి చేరింది. జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ 21 రోజుల జాప్యం వెనుక ఉన్న పూర్తి నిజాన్ని దేశం ముందు ఎందుకు బయటపెట్టలేదు?. 105సార్లు చోరీలు జరిగితే కేవలం 8 మంది నిందితులు మాత్రమే ఎలా ఉన్నారు? ఈ విచారణ అసలు లక్ష్యం కేవలం చిల్లర దొంగలను పట్టుకోవడమేనా?. కానుకల చోరీకి ఎవరు బాధ్యులో ఎప్పుడు నిర్ధరిస్తారు? కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై చిక్కుముడి వీడేది ఎప్పుడు?" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జూన్ నెలలో రామాలయంలో కానుకల చోరీ ఘటన బయటపడింది. అయితే, ఈ చోరీకి సంబంధించి సిట్ జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఒకట్రెండు సార్లు కాదు, ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ తేల్చింది. అందుకు సంబంధించిన చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డైనట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో అయోధ్య రామమందిర విరాళాల చోరీ దర్యాప్తుపై మోదీ సర్కార్‌పై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.



ప్రాజెక్టులకు పాత తేదీలతో పర్యావరణ అనుమతుల అంశంపై ఫైర్

ప్రాజెక్టులక

అనంత సూర్య తెలుగువార
సోమవారం 05 అక్టోబర్ 2026

'అనంత'లో హెరిటేజ్ వాక్

చారిత్రక వారసత్వ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యం..

అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య : తరతరాల అనంతపురం యొక్క ఘన చరిత్ర, సంస్కృతి, వారసత్వం, ప్రాచీన కట్టడాల యొక్క పరిరక్షణ, ఘనతను కేవలం నేటితరం యొక్క పరిరక్షణ బాధ్యత మాత్రమే కాకుండా భావితరాలకు అందించటంలో భాగంగా ఆదివారం హెరిటేజ్ వాక్ కార్యక్రమము జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సూచనలతో జిల్లా పురావస్తుశాఖ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ఓల్డ్‌టౌన్‌లో ఉన్న తొలి ఆసుపత్రిగా పేరుగాంచిన విక్టోరియా మెమోరియల్ హాస్పిటల్ వద్ద ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ చెన్నకేశవ స్వామి దేవాలయం, విరూపాక్ష స్వామి దేవాలయం, జామియా మసీదు, బసవన్న కట్ట, ఐరన్ బ్రిడ్జ్ మీదుగా ఉత్సాహభరిత కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ.. మన అనంతపురం జిల్లా ఎన్నో ప్రాచీన కట్టడాలకు ప్రసిద్ధి పొందినదని, క్రీస్తు శకం 15వ శతాబ్దం నుండి నేటి వరకు అనేక కట్టడాలు మన అనంతపురం జిల్లాలో ఉన్నాయని తెలియజేశారు. వీటిని పరిరక్షిస్తూనే, ఆ కట్టడాల యొక్క స్ఫూర్తిని, ఘనతను భావితరాల వారికి అందించేందుకు జిల్లా



యంత్రాంగం కృషి చేస్తుందని తెలియజేశారు. మన రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా, మన అనంతపురం జిల్లా యొక్క ప్రాచీన కట్టడాలు, వాటి యొక్క ఘనతను ప్రజల్లో తీసుకెళ్లే విధంగా బ్లూ ప్లేక్ అనే కాన్సెప్ట్‌ని తయారు చేయించడం జరిగిందని వివరించారు. ప్రతి వారసత్వ కట్టడాన్ని పరిరక్షేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ మాట్లాడుతూ.. హెరిటేజ్ వాక్ కార్యక్రమము ఇకమీదట మన జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, మన వారసత్వం యొక్క ఘనతను తెలుసుకోవాలని వారి ఇరువురు పిలుపునిచ్చారు. ప్రతి చారిత్రక కట్టడం వద్ద గైడర్‌గా కళాశాల విద్యార్థినులు ఆయా కట్టడాల చారిత్రక నేపథ్యం, నిర్మాణ విశిష్టత, ప్రాధాన్యతలను ఎంతో చక్కగా వివరించారు. విద్యార్థినుల వివరణలు పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. హెరిటేజ్ వాక్



ముగింపు కార్యక్రమం ఐరన్ బ్రిడ్జ్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా పలువురు హెరిటేజ్ వాకర్స్ మాట్లాడుతూ.. తాము ప్రతిరోజూ ఈ చారిత్రక కట్టడాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, వాటి వెనుక ఉన్న చరిత్ర, ప్రాధాన్యత గురించి ఇంతవరకు పూర్తిగా తెలుసుకోలేకపోయామని తెలిపారు. ఈ హెరిటేజ్ వాక్ లో పాల్గొనడం ద్వారా అనంతపురం నగరంలోని చారిత్రక వారసత్వ సంపద గురించి సమగ్రంగా తెలుసుకునే అవకాశం లభించిందని, ఇకపై ఈ కట్టడాల పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్, హెరిటేజ్ వాకర్స్, ఆయుష్ మెడికల్ అధికారి లాల్యానాయక్, నగర ప్రముఖులు, స్వచ్ఛంద కార్యకర్తలు, గైడ్స్, పురావస్తు శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయల్ మురళి స్వగృహంలో గంటా రవితేజ తేనీటి విందు

ఆత్మీయులను కలవడం ఎంతో సంతోషకరం : గంటా రవితేజ

అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య : నగరంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి నివాసానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ విచ్చేశారు. రాయల్ మురళి స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ.. రాయల్ మురళి నివాసానికి రావడం, ఇక్కడ ఎందరో ఆత్మీయులను నేరుగా కలుసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొంటూ మురళికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రాయల్ మురళి మాట్లాడుతూ.. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన రవితేజకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే



గంటా శ్రీనివాసరావుతో పాటు ఇతర ముఖ్య కాపు నాయకులు ఎల్లవేళలా కాపు సామాజిక వర్గానికి అండగా నిలుస్తున్నారని, భవిష్యత్తులో కూడా ఇదే రీతిన పూర్తి సహకారం, మద్దతు అందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు కేశవరెడ్డి, పట్టణ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ చెల్లా లక్ష్మీప్రసాద్, ముత్తువల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేయం షకీల్ షఫీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేఎం హర్షద్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, వైఎండి తాజుద్దీన్, జేసి శ్రీకాంత్, ఐఎంఎం బాషా, మార్కెట్ మహేష్, కాయగూరల విశ్వనాథ్, జనసేన పార్టీ నాయకులు కాయగూరల లక్ష్మీపతి, భవాని రవికుమార్, గల్లా హర్ష, కోలా తేజ, రాయల్ భాస్కర్, వలిగిరి నగేష్, ఒలిగిరి మునీంద్ర, వెంకట్ రాముడు, చలం రాజా, నల్లప్ప, కాపునాడు నాయకులు పూల పాండురంగయ్య, రాపా ధనుంజయ, సాయి సంపత్ నాయుడు, పట్టణ బ్యాంక్ ఉపాధ్యక్షుడు గోల్డ్ బాషా, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పైవేట్ స్కూల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య : స్థానిక అభ్యుదయ నగర్ లోని గల సృజన స్కూల్ లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కు నూతన రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయిన అనంతపురం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు అయిన గోపాల్ రెడ్డికి, అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన తాడిపత్రి బాబయ్యకి, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన తాడిపత్రి చంద్రశేఖర్ రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన కరస్పాండెంట్ మిత్రులు పాల్గొన్నారు. సందర్భంగా రాష్ట్ర సంఘానికి నాయకులుగా ఎన్నికైన గోపాల్ రెడ్డి, బాబయ్య, చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మన జిల్లా సంఘం చేస్తున్న కార్యక్రమాలకు మెచ్చి రాష్ట్రంలో మన జిల్లాకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ



మనకు కీలకమైన బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషించ తగ్గ విషయం అని, మీ యొక్క సంఘీయ సహకారాలతో మాపై ఉంచిన బాధ్యతలను వమ్ము చేయకుండా ప్రైవేట్ స్కూల్స్ సమస్యలను రాష్ట్రస్థాయికి తీసుకుపోయి పరిష్కారం చేయడానికి మా వంతు కృషి చేస్తామని తెలిపారు. మన జిల్లా సంఘాన్ని రాష్ట్ర సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి మీ సహకారం ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నామని వారు తెలియజేశారు. అనంతరం హాజరైన హాజరు కరస్పాండెంట్ మిత్రులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కోశాధికారి రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, నగర అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, గౌరవ సలహాదారులు రామాంజనేయులు, మద్దయ్య, నగర ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ సభ్యులు నార్పల సుధాకర్, రాజా రమేష్ అరుణ్ కుమార్, తాడిపత్రి డివిజన్ బాబయ్య, చంద్రశేఖర్ రెడ్డి, దివాకర్, వెంకటరమణ, సుబ్బరాయుడు, భాస్కర్ యాదవ్, చెన్నారెడ్డి, నాగేంద్ర రెడ్డి, రవిశంకర్, రంగయ్య, కంబగిరి, ప్రతాప్ రెడ్డి, బాబు, జిలానీ బాషా, నజీర్, రామలక్ష్మి రెడ్డి, నాగేశ్వర రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీ్కం వర్కర్లను వర్కర్లుగా గుర్తించాలి

తవణంపల్లి,అక్టోబర్ 4 (అనంత సూర్య):సీ్కం వర్కర్లను వర్కర్లుగా గుర్తించి కార్మిక చట్టాలను అమలు చేయడంతో పాటు వేతనాలు పెంచాలని ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. తవణంపల్లి మండలం దిగువమాఘం పార్కులో జరిగిన వీఓఏల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.వీఓఏలకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పని ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. ఫోన్లు, సిమ్‌లు ఇవ్వకుండా వరుసగా యాప్‌లు అందించి పని చేయాలని చెప్పడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వీఓఏలకు కొత్త ఫోన్లు, 5జీ సిమ్‌లు అందించాలని డిమాండ్ చేశారు.



మహిళా వీఓఏలతో అవమానకరంగా మాట్లాడటం సరికాదని, వారి సమస్యలపై చర్చించేందుకు జిల్లా స్థాయిలో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీఓఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, వేతనాల పెంపు, మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 1న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని వాడ గంగరాజు పిలుపునిచ్చారు. మండలం నుంచి అధిక సంఖ్యలో వీఓఏలు హాజరవుతామని తెలిపారు. ఈ సమావేశంలో వీఓఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, జగదాంబతో పాటు సుజాత, సుమతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నగరాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి



చిత్తూరు, అక్టోబర్ 4 (అనంత సూర్య): చిత్తూరు నగరాభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు.జిల్లా కేంద్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.నగరంలో రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్ల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు పనులను ఎంపీ, ఎమ్మెల్యేలు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు ముందస్తు సమాచారం లేకుండా ద్విచక్ర వాహనంపై నగరంలో పర్యటించి పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జులు, అధికారులతో కలిసి వీధుల్లో నడుస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నగర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు రూపొందించామని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. చిత్తూరు నగర రూపురేఖలు మార్చే క్రమంలో ప్రజలు, వ్యాపారులు మరికొంత కాలం సహకరించాలని కోరారు. నగరాభివృద్ధికి ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదని వారు పేర్కొన్నారు.

పాల్యంకొండ అభివృద్ధికి

టీటీడీ ద్వారా సహకారానికి హామీ

గుడిపాల,అక్టోబర్ 4 (అనంత సూర్య):గుడిపాల మండలంలోని పాల్యంకొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పాల్యంకొండ ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆయనకు వివరించారు.ఆలయ అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు స్పందిస్తూ టీటీడీ ద్వారా కూడా పాల్యంకొండ అభివృద్ధికి సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్యంకొండ ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్, కమిటీ సభ్యులు తారక రామ్, రమేష్, రాజు, సురేంద్ర నాయుడు, గోవింద నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్ పై స్పందన తెలియజేయండి

చిత్తూరు,అక్టోబర్ 4 (అనంత సూర్య):ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో బలోపేతం చేసేందుకు నిరంతరం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌ను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసు బోర్డులు, హెల్ప్‌డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.పీజీఆర్ఎస్ సేవలు పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజల స్పందన అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు.ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను సమర్పించి, అనంతరం క్యూఆర్ కోడ్ ద్వారా సేవలపై స్పందన తెలియజేయాలని కలెక్టర్ కోరారు.



పల్లె పండుగ 3.0 నిధులతో అభివృద్ధి పనులు

గుడిపాల,అక్టోబర్ 4(అనంత సూర్య):పల్లె పండుగ 3.0 నిధులతో గుడిపాల మండలంలో రూ.4.47 కోట్లతో 42 సిమెంట్ రోడ్లు, ఒక బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పల్లె పండుగ 1.0, 2.0 నిధులతో మండలంలోని గ్రామాల్లో సుమారు రూ.12 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, శంకుస్థాపనలు నిర్వహించనున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు కృషి చేయాలని కోరారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో నిర్మిస్తున్న నందమూరి తారక రామారావు విగ్రహాల పనులను త్వరగా పూర్తి చేయాలని నాయకులను సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ఉపాధ్యక్షుడు ధనసింగ్, మాజీ ఎంపీపీలు దీప శ్రీ, అనిల్‌కుమార్, నాగరాజు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి శరత్‌బాబు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



48వ డివిజన్‌లో.. మోహన్ మార్క్!



అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య :

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ 48వ డివిజన్‌ను సమస్యల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జ్ మోహన్ ముందుకు సాగుతున్నారు. గత కొన్నేళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న పలు సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మోహన్ చెబుతున్నారు. డివిజన్‌లో 30 ఏళ్లుగా నడిమివంక పూడిక వల్ల రజకనగర్, బాలాజీనగర్, గౌరవ గార్డెన్‌లు వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. మోహన్ కుమార్ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జ్‌గా వచ్చిన తర్వాత ఆయా ప్రాంతాల ప్రజలు సమస్య తెలపడంతో, వెంటనే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు విషయాన్ని తెలిపడంతో, ఆయన స్పందించి ప్రజల బాగోగులే ముఖ్యంగా భావించి వెంటనే మునిసిపల్ అధికారులకు నడిమివంక పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు.

- అభివృద్ధి పరుగులు.. మారుతున్న డివిజన్ రూపురేఖలు
- ఎమ్మెల్యే సహకారంతో 30 ఏళ్ల సమస్యకు చెక్
- ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్న మోహన్
- సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇంటింటా ఆత్మీయ పలకరింపు



30 ఏళ్లు పూడికతీతతో నిండిపోయిన నడిమివంకను ఎమ్మెల్యే సహకారంతో దగ్గరుండి పూడికతీత పనులు చేయిస్తున్న మోహన్ కుమార్

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. ఎమ్మెల్యే సహకారంతో మోహన్‌కుమార్ అక్కడే భీష్మించి కూర్చుని రాత్రి పగలు అనే తేడా లేకుండా జేసీబీల సహాయంతో పూడికతీత పనులు చేపట్టారు. ప్రస్తుతం సమస్య పరిష్కారం కావడంతో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా సాఫీగా వెళ్తుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జ్ మోహన్ కుమార్‌లను అభినందిస్తున్నారు. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా మోహన్‌కుమార్ ముందుకు సాగుతున్నట్లు స్థానికులు వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు డివిజన్‌లోని ఆయా ప్రాంతాల ప్రజలు తెలిపారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా :

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, ప్రతి ఇంటితోనూ ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ప్రజలతో మమేకమై వారి అవసరాలను తెలుసుకోవడం ద్వారా డివిజన్‌లోని సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం :

డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని మోహన్ పేర్కొంటున్నారు. ప్రజల సహకారం, ఎమ్మెల్యే కృషితో డివిజన్‌ను సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం పనులు చేయిస్తున్న టీడీపీ నాయకులు మోహన్ కుమార్



పూడికతో నిండిపోయిన నడిమివంక పరిస్థితి గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న మోహన్ కుమార్





దగ్గరుండి డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న టీడీపీ నాయకులు మోహన్

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే టీడీపీ లక్ష్యం

అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య :

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించేందుకు చేపట్టిన విధానాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం జీవో నెం.105, జీవో నెం.1065 జారీ చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గాయని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. దీనివల్ల బీసీలకు లభించాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాన్ని



- అన్న ఎన్టీఆర్ విధానాన్ని కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- బీసీ రిజర్వేషన్లపై జగన్ తన వైఖరిని మార్చుకోవాలి
- అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

సవాల్ చేస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించడం ద్వారా ఎన్నికల ప్రక్రియకు, బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్న అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయం కోణంలో చూడాల్సిన అవసరం ఉందన్నారు. హైకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవిస్తూనే, బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు ముందుకు సాగుతోందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తుందని, బీసీల హక్కులను కాపాడేందుకు అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన అవకాశాలను వినియోగిస్తుందని స్పష్టం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా వారికి స్థానిక సంస్థల నుంచి అన్ని స్థాయిల్లోనూ రాజకీయ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. బీసీల సామాజిక, రాజకీయ సాధికారతకు టీడీపీ కట్టుబడి ఉందన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో వైఎస్ జగన్ తన వైఖరిని మార్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బీసీలకు దక్కాల్సిన అవకాశాలను అడ్డుకునే విధానాలకు దూరంగా ఉండాలని కోరారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం.. సామాజిక న్యాయం.. ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. బీసీలకు దక్కాల్సిన హక్కులు, రాజకీయ అవకాశాల కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందాలి

కనగానపల్లి, అక్టోబర్ 4 అనంతసూర్య :

రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని.. ఆ తర్వాత అభివృద్ధి, సంక్షేమం పార్టీలకతీతంగా అందాలన్నదే మా ఉద్దేశ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ఘనంగా జరిగింది. ముత్తవకుంట్ల గ్రామం నుండి బోయవాండ్ల కొట్టాల వరకు రూ.1.30 కోట్ల వీబీజీ రామ్‌జీ నిధులతో నిర్మించనున్న 2 కిలోమీటర్ల బి.టి, సి.సి.రోడ్డు పనులకు ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు మంజూరు చేసినందుకు బోయవాండ్ల కొట్టాల గ్రామస్తులు ఎమ్మెల్యే సునీతను ఘనంగా సన్మానించారు. పంచాయతీలో వీధిలైట్లు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ.6 లక్షల సిఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అలాగే ముత్తవకుంట్ల, తల్లిమడుగుల, బోయవాండ్ల కొట్టాల రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలువలను పంపిణీ చేశారు. బోయవాండ్ల కొట్టాల గ్రామంలో కొత్త వాటర్ ప్లాంట్ నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పనులను పూర్తి చేయాలని మరియు మరికొన్ని చోట్ల సిసి రోడ్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరగా.. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. పల్లె పండుగ 1, 2 విడతల్లో భాగంగా ముత్తవకుంట్ల, తల్లిమడుగుల గ్రామాల్లో సిసి రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలను ఇప్పటికే పూర్తి స్థాయిలో నిర్మించామని తెలిపారు. పల్లె పండుగ 3.0 ద్వారా అనేక రోడ్లు, గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటి ముందు రోడ్డు, ప్రతి పల్లెలో డ్రైనేజీ నిర్మించడమే కాకుండా, రైతుల సంక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన హార్టికల్చర్ హబ్ ద్వారా పంటల ఎగుమతులకు వీలుగా రోడ్లు, డ్యామ్‌ల నిర్మాణాలు, ఇతర కార్యక్రమాలు అన్ని ప్రాంతాల్లో చేపడుతారన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో అందించబోయే పింఛన్లను ఎలాంటి రాజకీయాలు చూడకుండా అర్హులైన వారందరికీ అందజేస్తామని చెప్పారు. మనం వేసిన రోడ్లకు ఉండే శిలాఫలకాలను ధ్వంసం చేసే రాజకీయ సంస్కృతిని వీడాలని ఎమ్మెల్యే సునీత హితవు పలికారు.

అభివృద్ధికి ఎప్పుడూ పరిటాల కుటుంబం ముందే ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఆ తర్వాత అందరం కలిసి కట్టుగా అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పనుల కోసం ఏ పార్టీ వారైనా సరే తమ ఇంటికి వస్తే తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.



ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై స్పష్టమైన ఆదేశాలివ్వాలి

బుర్రా జయవర్ధన్ రెడ్డి



అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య :

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో అమలు చేస్తున్న 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ఓసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రా జయవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కేంద్రంలో ఒక విధంగా, రాష్ట్రంలో మరో విధంగా ఉండటం వలన అగ్రవర్ణ పేద విద్యార్థులు నిరుద్యోగులు, గందరగోళానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందేందుకు అర్హత గా కేవలం 8 లక్షల ఆదాయ పరిమితి మాత్రమే ఉండాలని, 5 ఎకరాలలోపు వ్యవసాయ భూమిని తీసేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు ఓసి అభ్యర్థులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా చాలా ఇబ్బందులకు వెళుతున్నారని పేర్కొన్నారు. ఐదు ఎకరాల కంటే వ్యవసాయ భూమి ఉన్న వర్షాలు లేక పంటలు ఎండిపోయి భూములన్నీ కేవలం బీడు భూములుగా మారిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేయకుండా అప్లై చేసిన ప్రతి ఓసి అభ్యర్థికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా మన రాష్ట్రంలో కూడా ఆదాయ పరిమితిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటే ఓసి అభ్యర్థులకు ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తున్న తరుణంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి ఏ ఒక్క ఓసి విద్యార్థికి అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓసి నిరుద్యోగులకు వయోపరిమితి పెంచి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకు ఉచిత నేత్ర వైద్యం

డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కూపన్లు పంపిణీ

అనంతపురం, అక్టోబర్ 4 అనంత సూర్య :



ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య సౌకర్యం పొందేందుకు ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో కూపన్లు పంపిణీ చేశారు. అనంతపురం ప్రెస్‌క్లబ్ అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత వైద్య సౌకర్యాన్ని కల్పించారు. ఈ నెల (అక్టోబర్) 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వర్కింగ్ జర్నలిస్టులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని జూడియో వస్త్ర దుకాణం పైభాగంలో ఉన్న డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రిలో సంప్రదించి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. నిర్ణీత గడువులోపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కంటి ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నలుగురు సభ్యులున్న కుటుంబానికి ఒక కూపన్, వ్యక్తులకు వేరుగా మరో కూపన్ మేరకు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో అనంతపురం ప్రెస్‌క్లబ్ అడ్‌హాక్ కమిటీ ఉపాధ్యక్షులు మల్లెబోయిన రామాంజనేయులు, కోశాధికారి కొత్తపల్లి. అనిల్‌కుమార్ రెడ్డి, సభ్యులు కేపీ కుమార్, సీనియర్ జర్నలిస్టులు అమినేని రవిచంద్ర, డాక్టర్ సూర్య, డేవిడ్, పాత్రికేయులు శంకర్, ఎనుముల కుళ్లాయప్ప, హిందూ ఫోటోగ్రాఫర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405